క్లుప్తంగా

14న వాహనాల వేలం

సీతానగరం: సారా కేసుల్లో మండలంలో పట్టుబడిన వాహనాలను ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 14న సీతానగరం ఎస్‌ఈబీ సర్కిల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్టు సీఐ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాల్గొనే వారు వారి ఆధార్‌కార్డు తీసుకురావాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చెల్లెంపేటలో సీసీ రోడ్డు నిర్మాణం



నిర్మిస్తున్న సీసీ రోడ్డు

బలిజిపేట: మండలంలోని శివరాంపురం పంచాయతీ పరిధి చెల్లెంపేటలో 30మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు శివరాంపురం సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు చొరవతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే జోగారావుకు విన్నవించుకోవడంతో వెంటనే నిధులు మంజూరుచేయించి నిర్మాణం చేపట్టాలని ఆదేశించడంతో పనులు చేయిస్తున్నట్టు సర్పంచ్ శ్రీనివాసరావు తెలిపారు.


శంబరలో అగ్ని ప్రమాదం



కాలిపోతున్న టిఫిన్ దుకాణం

సాలూరు: మక్కువ మండలంలోని శంబర గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో టిఫిన్ దుకాణం దగ్ధమైంది. ఎవరో కావాలనే తన దుకాణాన్ని కాల్చేశారని బాధితుడు బోగి బాలరాజు ఆరోపిస్తున్నాడు. మంటల తీవ్రతకు టిఫిన్ దుకాణం పక్కనే ఉన్న మరో దుకాణానికి కూడా మంటలు వ్యాపించాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు శుక్రవారం గ్రామానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు.

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన



డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొన్న డీఎం భాస్కరరెడ్డి

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డీఎం భాస్కరరెడ్డి 12 ఫోన్ కాల్స్ స్వీకరించారు. సాలూరు నుంచి బొబ్బిలికి బోరబంద, దేవుబుచ్చింపేట గ్రామాల మీదుగా బస్సు నడపాలని.. శంబర గ్రామానికి సాయంత్రం ఆరు గంటలకు సర్వీస్ నడపాలని.. తదితర సమస్యలు పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీఎం హామీ ఇచ్చారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



మక్కువలో పర్యటిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. మక్కువ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తప్పుల్లేని ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌స్థాయి అధికారులు తప్పకుండా ఉండాలని ఆదేశించారు. బీఎల్‌ఓల వద్ద ఫారం-6,7,8 అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

15న ప్రజారక్షణ భేరి

పాలకొండ రూరల్: అసమానతలు లేని అభివృద్ధి ధ్యేయంగా సీపీఎం నేతృత్వంలో ఈ నెల 15న చేపట్టదలచిన ప్రజారక్షణ భేరీ విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకుడు కాద రాము అన్నారు. శుక్రవారం తమ సహచరులతో కలసి రక్షణ భేరికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేసారు. విజయవాడలో జరగనున్న బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీలోని నాలుగో సచివాలయం, మండలంలోని పెదపథం సచివాలయం పరిధి, మక్కువ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ, జగన్ మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మున్సిపాలిటీలో 4వ సచివాలయ పరిధిలోని 8,9 వార్డులకు సంబంధించి సుమారు 19 కోట్ల రుపాయల సంక్షేమం, రూ. 85 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పెదపథం సచివాలయంలో సుమారు 20 కోట్ల రూపాయల సంక్షేమ పథకాలు.. 3 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బాగువలసలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసులనాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ గిరి రఘు, జర్జాపు ఈశ్వరరావు, గొర్లె జగన్, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: సాలూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాచిపెంట: సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రమీల, తదితరులు

చేసిన మేలును వివరించడానికే..

పాచిపెంట: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచిని వారికి వివరించడానికే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపడుతున్నామని ఎంపీపీ బద్నాన ప్రమీల, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోరజని సింహాచలం అన్నారు. మండలంలోని పద్మాపురం సచివాలయం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సంక్షేమం కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలువలపల్లి పెద్దిబాబు, నాయకులు గొర్ల గణపతిరావు, సలాది అప్పలనాయుడు, దండి కొండలరావు, సర్పంచ్‌లు ఇజ్జాడ అప్పలనాయుడు, చెల్లూరి సీతారాం, దండుపాటి రాము, చింత సీతయ్య, సోముల లచ్చయ్య, దమ్మి సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు కాదల అన్నపూర్ణ, మాదల సత్యవతి, డొనేరు లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: మక్కువలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసులనాయుడు, తదితరులు

సంధ్యారాణి విమర్శలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: ప్రజాక్షేత్రంలో ఒక్కసారి కూడా గెలవలేని టీడీపీ నాయకురాలు గుమ్మడి సంధ్యారాణి తన స్థాయి మరిచి నేడు స్పీకర్, మంత్రులను విమర్శించడం హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, పెద్దింటి మాధవ, తదితరులు అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, సంధ్యారాణిపై టీడీపీ అధినేత చంద్రబాబుకే నమ్మకం లేదన్నారు. ఇప్పటికే పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యే టికెట్‌ను ఎన్‌ఆర్‌ఐకు కేటాయించారని... కురుపాం, సాలూరు నియోజకవర్గాలకు ఎన్‌ఆర్‌ఐలను వెతికే పనిలో చంద్రబాబు ఉన్నారన్నారు. టీడీపీ రాజకీయాలు డబ్బుల చుట్టూ తిరుగుతుంటాయని, అటువంటి టీడీపీ నాయకులకు మంత్రి రాజన్నదొరను విమర్శించే అర్హత లేదన్నారు. ప్రజావిశ్వాసం పొందడం వల్లే రాజన్నదొర వరుసుగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని చెప్పారు. రాజన్నదొర మీద జగన్ మోహన్‌రెడ్డికి నమ్మకం ఉండడం వల్లే ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని తెలిపారు. ఒకప్పుడు టీడీపీ సాలూరు నియోజకవర్గ బాధ్యతలను చంద్రబాబునాయుడు రాజులకు అప్పగించగా.. నేడు ఎన్‌ఆర్‌ఐల కోసం వెతుకుతుండడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సామాజిక సాధికారయాత్రలో ఎస్టీ, ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన మంత్రులు, స్పీకర్, తదితరులు సామాజిక సాధికారిత, ప్రజాసంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడితే సంధ్యారాణి ఓర్వలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత టీడీపీ పాలనలో స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాద్ నాడు చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం, పుష్పాభిషేకాలు చేయడంతో పాటు టీడీపీ కండువాలు వేసుకుని బహిరంగ సమావేశాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. నాడు ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి ఎందుకు స్పందించలేని ప్రశ్నించారు. 2014లో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ చంద్రబాబు బోస్‌బొమ్మ సెంటర్లో రోడ్డుపై మీటింగ్ పెట్టడం.. 2013లో పట్టణ పోస్టాఫీస్ దగ్గర నడిరోడ్డు మీదనే టీడీపీ నాయకులు దీక్షలు చేయడం సంధ్యారాణి మరిచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సామాజిక సాధికార యాత్రలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర 12 ముఖ్యమైన డిపార్ట్‌మెంట్ల ద్వారా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరించడం సంధ్యారాణికి రుచించలేదని ఎద్దేవా చేశారు. ఎవరి హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

సీతానగరం: ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ వరప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలకు రూ.2,600 విలువగల జీపీఎస్ పరికరాన్ని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పరికరం ఏర్పాటు చేసేందుకు టెక్నీషియన్ సంగీత్‌కుమార్ అందుబాటులో ఉంటారని చెప్పారు. వ్యవసాయాధికారి అవినాష్ మాట్లాడుతూ రబీ విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

వ్యక్తికి గాయాలు



బోల్తా పడిన వ్యాన్

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి సమీపంలో వ్యాన్, బైక్ ఢీకొన్న సంఘటనలో గెడ్డగూడకు చెందిన సవర వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. పాలకొండ నుంచి కొత్తూరు వైపు కూరగాయాల లోడ్‌తో వ్యాన్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. బైక్‌పై వ్యక్తికి మాత్రమే గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఎ.నీలకంఠరావు తెలిపారు.

సామాజిక సాధికార యాత్రలో బైక్ ర్యాలీ



ఎమ్మెల్యే జోగారావుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

సీతానగరం: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్లలో గ్రామాల్లో అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చేస్తున్న అభివృద్ధిని వివరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రముఖులు శుక్రవారం సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. మండలంలోని లచ్చయ్యపేటలో ప్రారంభమైన బైక్ ర్యాలీలో వందలాదిమంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులతో కలిసి పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూడా పాల్గొన్నారు.

సచివాలయం భవనం ప్రారంభం

మార్గమధ్యంలో కాశీపేట వద్ద రూ.42 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయం భవనాన్ని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. వారితో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, అరకు,విజయనగరం ఎంపీలు గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్రశేఖర్, కురుపాం, బొబ్బిలి ఎమ్మెల్యేలు పాముల పుష్ప శ్రీవాణి, శంబంగి వెంకటచినప్పలనాయుడు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ బి.రమణమ్మ, సర్పంచ్‌లు సీహెచ్.కృష్ణ, తేలు ధనుంజయమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్వతీపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడుతున్న ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి



కాశీపేటలో నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, పక్కన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



లచ్చయ్యపేట నుంచి అప్పయ్యపేట వరకు బైక్ ర్యాలీతో వస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పది ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం



వంతరాం ఉన్నత పాఠశాలను పర్యవేక్షించిన ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ సామల

బలిజిపేట: రానున్న పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు కృషిచేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ-1సామల సింహాచలం కోరారు. శతశాతం లక్ష్యసాధనకు మండలంలో ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించినట్లు చెప్పారు. అందులో భాగంగా వంతరాం, అరసాడ ఉన్నత పాఠశాలలకు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ సామల సింహాచలంలను ప్రత్యేకాధికారులుగా నియమించడంతో వారు ఆయా పాఠశాలలను శుక్రవారం పర్యవేక్షించారు. పదవ తరగతి పరీక్షలు, సిలబస్, చదువుపై ప్రణాళికలు తదితర అంశాలలో ముందుగా విద్యార్థులను ప్రశ్నించారు. వారికి సూచనలు సలహాలు అందించారు. రాబోయే పరీక్షలకు ఏవిధంగా కార్యోన్ముఖులు కావాలో సూచించారు. కార్యక్రమంలో వంతరాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర సాగిందిలా..



అంటిపేట గ్రామంలో సచివాలయాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు జనసందోహం వెల్లువెత్తింది. సాధికార యాత్ర దృశ్యమాలిక ఇలా ఉంది.



పార్వతీపురం టౌన్‌లో అభిమానుల కేరింతలు



సీతానగరం వద్ద తప్పెట గుళ్లు



బస్సులో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



తీన్‌మార్ డప్పువాయిద్యాలు



బహిరంగ సభ వద్ద జాన పద గేయ ప్రదర్శన

ఉపాధ్యాయుడిగా జేసీ...

పాచిపెంట: పార్వతీపురం – మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు శుక్రవారం ఉపాధ్యాయుడి అవతారం ఎత్తారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆయన్ను స్పెషల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో జేసీ పాఠశాలను శుక్రవారం సందర్శించి, పదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పి, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు ఎక్కువ మంది గైర్హాజరు కావడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ఇదిలా ఉంటే గతంలో ఆయన 12 సంవత్సరాల పాటు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఎంఈఓ జోగారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న జేసీ గోవిందరావు

16న ఉద్యాన క్షేత్ర ఫలసాయం వేలం పాట

సీతంపేట: సీతంపేట, పనుకువలసలో ఉన్న ఉద్యానవన క్షేత్రంలో అటవీ ఫలసాయాలు వేలం పాట ఈ నెల 16న నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జీడి, జామ, కొబ్బరి, సపోటా చెట్ల ఫల సాయాలు వేలం వేయనున్నామన్నారు. రూ.25వేలు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9392917685 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.